సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



అన్నదానం ట్రస్టుకు విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు జాన ప్రభాకర రావు, నాగరత్నం దంపతులు (హైదరాబాద్) రూ.30 వేల విరాళం సమర్పించారు.




అతి వేగానికి యువకుడి బలి

దేవరపల్లి మండలం గౌరీపట్నం వద్ద ఆగి ఉన్న వ్యాన్‌ను వెనుక నుంచి ద్విచక్ర వాహనం వేగంగా ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు.

8లో

డెల్టాలకు 8,700 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 8,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,600, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,400 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.60 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఆర్యవైశ్య మహాసభ మహిళా అధ్యక్షురాలిగా సీతామహాలక్ష్మి



అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్య వైశ్య మహాసభ మహిళా అధ్యక్షురాలిగా అమలాపురానికి చెందిన యెండూరి సీతామహాలక్ష్మి రెండో సారి ఎన్నికయ్యారు. కాకినాడ జిల్లా అన్నవరంలో బుధవారం జరిగిన జిల్లా ఆర్య వైశ్య మహాసభ సమావేశంలో సీతామహాలక్ష్మి జిల్లా మహిళా అధ్యక్షురాలిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆర్య వైశ్య సంఘాలకు సంబంధించి పలు అనుబంధ కమిటీల్లో కీలక పదవులు నిర్వహిస్తున్న సీతామహాలక్ష్మి జిల్లా మహిళా విభాగం ద్వారా ఆర్యవైశ్య మహిళలకు సేవలందిస్నుందుకు ఆమెను ఈ పదవి రెండో సారి వరించిందని మహాసభ అధ్యక్షుడు కంచర్ల బాబి అన్నారు. తనతో పాటు కార్యదర్శిగా గ్రంధి సుజాత, కోశాధికారిగా కాసు భవాని కూడా ప్రమాణ స్వీకారం చేశారని సీతామహాలక్ష్మి తెలిపారు. ఈ మేరకు అమలాపురం ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు నంబూరి సత్యనారాయణ మూర్తి, యెండూరి నాగేశ్వరరావు, వరదా సూరిబాబు, అప్పన వీరన్న, వంకాయల కాశీ తదితరులు సీతామహాలక్ష్మి ఎంపికపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం అదనపు కార్యదర్శి యెండూరి రాఘవ ఆమెను అభినందించారు.

పశుగ్రాసానికి వెళ్లి.. అసువులు బాసి..



సంఘటనా స్థలంలో నాగేంద్ర మృతదేహం

గండేపల్లి: పశుగ్రాసానికి పొలానికి వెళ్లిన వ్యక్తి అసువులు బాసిన వైనమిది. ఉదయాన్నే పొలానికి వెళ్లిన అతడు తిరిగి వస్తాడని ఎదురు చూసిన కుటుంబ సభ్యులకు చివరికి కన్నీళ్లే మిగిలాయి. రంగంపేట మండలం పెదరాయవరం గ్రామానికి చెందిన కాకర్ల నాగేంద్ర (34) గండేపల్లి మండలం యల్లమిల్లిలో గారపాటి కామరాజుకు చెందిన పొలాన్ని కొంత కాలంగా కౌలుకు చేస్తున్నాడు. రోజులానే గురువారం ఉదయాన్నే పొలానికి వెళ్లి, పశువుల కోసం చొప్ప కోసుకుని, మోపు కట్టుకుని తల పైకి ఎత్తుకునే సమయంలో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు చొప్ప వెన్నులు తగిలాయి. దీంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురైన అతడు అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య నాగు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అతడి పైనే కుటుంబం ఆధారపడి ఉందని, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సోషల్ మీడియాలో హద్దులు దాటితే చర్యలు

కాకినాడ క్రైం: సోషల్ మీడియాలో హద్దులు దాటి వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు, మార్ఫింగ్ ఫొటోలు, మా ర్ఫింగ్ వీడియోలు, సున్నిత అంశాలపై అసంబద్ధ ప్రస్తావనలు, కులమతాలు, ఓ వర్గాన్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలతో కూడిన పోస్టులు, వ్యక్తిగత దూషణలకు దిగితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. నెటిజన్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

ఆక్టోపస్ శిక్షణ పూర్తి

కాకినాడ క్రైం: ఉగ్ర చర్యల నిరోధక సంస్థ ఆక్టోపస్ ప్రత్యేక శిక్షణ తరగతులు పూర్తయ్యాయి. కాకినాడ రంగరాయ వైద్య కళాశాల(ఆర్ఎంసీ)లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణలో 40 మంది కమాండోలు శిక్షణ పొందారు. ఆక్టోపస్ అదనపు ఎస్పీ సి.రాజారెడ్డి పర్యవేక్షణలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.మురళీకృష్ణ, కె.మహేష్‌ల ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్, రెక్కీలపై శిక్షణ నిర్వహించారు. ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ఆదేశాలతో వైస్ ప్రిన్సిపాల్ శశి, ఫోరెన్సిక్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫణికిరణ్, లైబ్రేరియన్ లక్ష్మణరెడ్డి నిర్వహణ బాధ్యతలు చేపట్టారు.

కల కానకనే దివికేగిన దిగ్గజం

- జాతీయ బ్యాడ్మింటన్ రిఫరీ విశ్వనాథం మృతి
- తనయుడు సాత్విక్ ఖేల్‌రత్న పురస్కార స్వీకారానికి వెళ్తుండగా హఠాన్మరణం
- ఉమ్మడి తూర్పులో క్రీడలపై చెరగని ముద్ర
- పీడీగా, శిక్షకునిగా ఎంతోమందికి తర్ఫీదు



కుమారుడు సాత్విక్ పేరున కలెక్టర్ నిధులతో నిర్మించిన వుడెన్ కోర్టు



రంకిరెడ్డి కాశీ విశ్వనాథం (ఫైల్)

క్రీడల్లో ఆయన ఓ ఎవరెస్టు. ఎందరో క్రీడాకారులకు ఆయనో ద్రోణాచార్యుడు. ఎందరో గురువులకు ఆయన ఓ లక్ష్యం. అటువంటి వారెందరినో చూసి మురిసిపోయే ఆయన.. తన కలల పంట.. కుమారుడు సాత్విక్ సాయి రాజ్ ఇంతింతై వటుడింతయై అని అంతకంతకూ ఆయన ప్రవీణుడైన బ్యాడ్మింటన్ క్రీడనే అందిపుచ్చుకుని ఎదిగిపోతుంటే.. ఆ ఘనతలను కళ్లారా చూస్తూ.. వారూ వీరూ మెచ్చుకుంటుంటే.. సంబరపడిపోయారు. ప్రభుత్వం సైతం అత్యున్నత పురస్కారం ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న ప్రకటించడంతో ఆయన ఆనందానికి అవధులు లేవు. ఆ గౌరవాన్ని కుమారుడు అందుకునే ఉద్విగ్న క్షణాలను కళ్లారా చూడాలని ఆశపడ్డారు. ఆ కార్యక్రమానికి బయలుదేరారు. ఉన్న ఊరు దాటారో లేదో విధి అమాంతం ఆయనను అందని తీరాలకు తీసుకుపోయింది. బ్యాడ్మింటన్ క్రీడలో ఆయన తీర్చిదిద్దిన ఎందరో ఆణిముత్యాలు ఈ హఠాత్పరిణామాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.

సాక్షి, అమలాపురం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా క్రీడారంగంలో 'కాశీ' అంటే తెలియని వారు ఉండరు. క్రీడాకారునిగా, క్రీడా శిక్షకునిగా, వ్యాయామోపాధ్యాయునిగా, న్యాయ నిర్ణేతగా, అంతర్జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుని తండ్రిగా ఇలా క్రీడలకు సంబంధించి అన్ని రంగాల్లోనూ ఆరితేరిన వ్యక్తిగా రంకిరెడ్డి కాశీ విశ్వనాథం చెరగని ముద్ర వేశారు. అటువంటి కాశీ గురువారం మృతి చెందడం ఉమ్మడి తూర్పు క్రీడాకారులు.. క్రీడాభిమానులలో విషాదాన్ని నింపింది. అంతర్జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ తండ్రి, జాతీయ బ్యాడ్మింటన్ రిఫరీ రంకిరెడ్డి కాశీ విశ్వనాథం (66) మృతి చెందారు. న్యూఢిల్లీలో జరిగే ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డును సాత్విక్ అందుకోవాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇంటి నుంచి ఢిల్లీ బయలుదేరిన కాశీకి సొంత ప్రాంతమైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణం దాటిన వెంటనే గుండెపోటుకు గురై మృతి చెందారు. కాశీకి భార్య, ఇద్దరు కుమారులు

క్రీడాకారులు, క్రీడాభిమానులకు 'కాశీ' సుపరిచితులు. క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారునిగా రాష్ట్రస్థాయిలో పలు పోటీల్లో పాల్గొన్న కాశీ షటిల్ బ్యాడ్మింటన్ జాతీయ రిఫరీగా పలు జాతీయ, అంతర్జాతీయ టోర్నీలకు సేవలందించారు. కాశీ ప్రభుత్వ పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా, ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి పదవీ విరమణ చేశారు. ఆయన పనిచేసిన ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జాతీయస్థాయి వాలీబాల్, అంబాజీపేట ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి క్రికెట్, అమలాపురం ఆఫీసర్స్ క్లబ్‌లో రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల నిర్వహణలో కీలకంగా వ్యవహరించారు. కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ (కేఎస్‌బీఏ) కార్యదర్శిగా, అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ కార్యదర్శిగా సైతం సేవలందించారు. గత ప్రభుత్వ హయాంలో తన కుమారుడు సాత్విక్ పేరు మీద రూ.ఐదు లక్షలు, కలెక్టర్ నిధులతో కలిపి ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో వుడెన్ కోర్టు నిర్మాణం చేయించారు. కాశీ వద్ద వ్యాయామోపాధ్యాయ విద్యలో సలహాలు, సహకారం పొందిన సుమారు 18 మంది ప్రభుత్వ పాఠశాలల్లో పీఈటీలుగా, పీడీలుగా పనిచేస్తుండడం విశేషం.

బ్యాడ్మింటన్‌పై మక్కువతో సాత్విక్‌ను అంతర్జాతీయ క్రీడాకారునిగా తీర్చిదిద్దడంలో తండ్రిగా, తొలి శిక్షకునిగా కాశీ సఫలీకృతులయ్యారు. సాత్విక్ కామన్‌వెల్త్, థామస్ కప్, ఆసియా కప్‌లో స్వర్ణ, రజిత పతకాలు పొందిన విషయం తెలిసిందే. సాత్విక్‌కు 2022–23 సంవత్సరానికి ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న పురస్కారానికి ఎంపికయ్యారు. ఆ అవార్డును కొన్ని అనివార్య కారణాల వల్ల అందుకోవడం ఆలస్యమైంది. తాజాగా సాత్విక్ న్యూ ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ కార్యక్రమాన్ని చూసేందుకు బయలుదేరిన విశ్వనాథం అకస్మాత్తుగా మృతి చెందడంతో ఉమ్మడి జిల్లాలోని క్రీడాభిమానుల్లో విషాదాన్ని నింపింది. వెటరన్ క్రీడాకారుడు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కాశీకి ఘన నివాళి అర్పించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వంటెద్దు వెంకన్నాయుడు, అముడా చైర్మన్ అల్లాడ సోంబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్లు చిక్కాల గణేష్, యాళ్ల సతీష్, అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ కాశీ కుటుంబ సభ్యులను పరామర్శించారు.



అమలాపురం ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్మించిన వుడెన్ కోర్టు

పకడ్బందీగా గ్రూప్–2, ఇంటర్ పరీక్షలు

అధికారులకు కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశం

అమలాపురం రూరల్: ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్న గ్రూప్–2, మార్చి ఒకటో తేదీ నుంచి నిర్వహించనున్న ఇంటర్మీడియెట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం ఆయన వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులతో అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరీక్షల నిర్వహణ, పీ4 సర్వే, ఎంఎస్ఎంఈ సర్వే ప్రజా సంతృప్తికి గీటురాయిగా ప్రవేశపెట్టిన ఐవీఆర్ఎస్ వాట్సాప్, క్యూఆర్ కోడ్ విధానాల పురోగతి, జిల్లాల వారీగా ర్యాంకులపై జిల్లా కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ మాట్లాడుతూ ఇంటర్, గ్రూప్–2 పరీక్షల నిర్వహణకు స్క్వాడ్లు, ఇన్విజిలేటర్ల బృందం సమన్వయంతో పరీక్షలను సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాల వద్ద భద్రతను మరింత పెంచాలన్నారు. స్వర్ణాంధ్రవిజన్‌లో మొదటి అంశంగా ఉన్న ప్రభుత్వ– ప్రైవేట్– ప్రజల భాగస్వామ్యం వ్యవస్థను ఉగాది నుంచి అమలు చేయనున్నారని, ఈ లోపుగా రెండో దశ సర్వే గ్రామ సభలు విజయవంతంగా నిర్వహించేందుకు సీపీఓ, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారులు మాస్టర్ ట్రైనర్ల శిక్షణకు సర్వేకు సిబ్బందిని సన్నద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ టి.నిశాంతి, సీపీవో వెంకటేశ్వర్లు, ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారి సోమశేఖర రావు, జీఎస్‌డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్ ఎస్.త్రినాథ రావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు మంచి ర్యాంక్ రావాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ సేవలపై సంతృప్త స్థాయిలను పర్యవేక్షించేందుకు వివిధ పథకాల అమలుకు సంబంధించి మంచి ర్యాంకు తీసుకురావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి మండల స్థాయి వరకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాస్థాయి అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో ఈ మేరకు సమీక్షించారు. ఐవీఆర్ఎస్ వాట్సప్, క్యూఆర్ కోడ్ విధానాల ద్వారా వివిధ సంక్షేమ పథకాల అమలుపై రెండు వారాలలో ఆశించిన పురోగతిని సాధించి మంచి ర్యాంక్ రాబట్టాలని ఆదేశించారు.

వర్సిటీ ప్రగతే పరమావధి



ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకుని.. జీవితానికి ఓ గమ్యం నిర్దేశించుకుని.. ఆసక్తి, అభిరుచికి అనుగుణంగా ఉన్నత విద్య అభ్యసించేందుకు వచ్చిన యువతకు జీవితంలో స్థిరపడేలా చేయడమే కాకుండా.. సమాజానికి ఉపయోగపడేలా వారిని తీర్చిదిద్దేవి విశ్వవిద్యాలయాలు. విద్యార్థులకు మార్గదర్శకత్వాన్ని అందించే బాధ్యత ఆ వర్సిటీల అధ్యాపకులదే. అంతకు మించి కీలక బాధ్యత ఆ వర్సిటీ ఉప కులపతి (వైస్ చాన్సలర్) పై ఉంటుంది. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో అటువంటి కీలక పదవిలో నియమితులయ్యారు **ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ**. గిరిజన తెగలో జన్మించిన ఆమె.. కష్టపడి, ఉన్నత చదువులు చదివి.. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించి వైస్ చాన్సలర్ స్థాయికి ఎదిగారు. బోధనారంగంలో అపార అనుభవం కలిగిన ఆమె వీసీగా ప్రత్యేక విజన్‌తో పని చేసి, 'నన్నయ' వర్సిటీ ప్రగతిని ఇనుమడింపజేయాలని భావిస్తున్నారు. వీసీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా 'సాక్షి'తో ఆమె ముచ్చటించారు.

ఆనందంగా ఉంది

యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కావాలని అధ్యాపకులైన ప్రతి ఒక్కరికీ డ్రీమ్ ఉంటుంది, అది సాధారణ కమ్యూనిటీలోని వారికి సాకారం కావచ్చునేమో కానీ.. నాలాంటి ఒక గిరిజన మహిళకు కష్టమే. చదువు ఎందుకు అనే సమాజంలో పుట్టిన నేను ఒక యూనివర్సిటీకి వైస్ చాన్సలర్ కావడమంటే అవధులు లేని ఆనందంగానే ఉంది.

ఆ అదృష్టం నాదే..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 1957లో ఆవిర్భవించాక ఇంతవరకూ ఏ యూనివర్సిటీకీ గిరిజన మహిళ వీసీ కాలేదు. ఆ అవకాశం నాకే దక్కడం అదృష్టంగా భావిస్తున్నా.

ఒకే కుటుంబంగా పని చేయాలి

1987లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బోధనా వృత్తిలోకి అడుగుపెట్టాను. ఆంధ్రా యూనివర్సిటీ డిపార్టుమెంట్ ఆఫ్ ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా పని చేశా. 38 సంవత్సరాల సీనియారిటీతో ఉన్న తనను 'నన్నయ' వీసీగా నియమించినందుకు కృతజ్ఞతలు. పరిపాలన నాకు కొత్త కాదు. చిందరవందరగా ఉన్న వలకు మాట్లు వేసి, సరిచేసే ప్రయత్నంలో ఉన్నా. వర్గాలు, వైషమ్యాలు విడనాడి, వర్సిటీ ప్రగతికి అందరూ ఒకే కుటుంబంలా పని చేస్తేనే ఇక్కడ ఉంటారు.

పరిశోధనలకు ప్రోత్సాహం

సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ, సమాజానికి తోడ్పడేలా పరిశోధనలు జరగాలి. అందుకు అవసరమైన ప్రోత్సాహాన్ని పరిశోధకులకు ఇచ్చేందుకు ఇక్కడున్న వనరులు, సదుపాయాలపై ఆకళింపు చేసుకుని, తదనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

రాష్ట్రపతి నుంచి అవార్డు

ఆకలి వేసిన వారికి ఆహారం అందిస్తేనే దానికి విలువ ఉంటుంది. ఆ భావనతోనే అంతరించిపోయే పరిస్థితిలో ఉన్న 19 ఆదిమ జాతి భాషలకు లిపిని అందించే ప్రయత్నం చేశాను. ఆ సమయంలో అనేక మంది పెద్దల నుంచి సరైన సహకారం లభించకపోగా, అవమానాలు ఎదురయ్యాయి. అయినా వెనుకడుగు వేయకుండా వారి సంస్కృతీ సంప్రదాయాలపై పరిశోధనలు చేసి 19 గిరిజన భాషలకు లిపి రూపొందించాను. ఈ కృషికి గుర్తింపుగా అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి 2022లో నారీశక్తి పురస్కారం అందుకున్నా.

నేనూ గోదావరి వాసినే..

సాహిత్య, సాంస్కృతిక రాజధానిగా పేరొందిన రాజమహేంద్రవరం, ముఖ్యంగా గోదావరి తీరాన ఉన్న నన్నయ వర్సిటీకి వీసీగా పని చేయడం సంతోషంగా ఉంది. నా అత్తింటి వారు రాజమహేంద్రవరం వారే. అల్లు ఎరకయ్య మా మామయ్య. అలా నేను కూడా గోదావరి వాసినే అయినందుకు గర్వపడుతున్నాను.

మూడు హోటళ్లపై కేసులు

- అపరిశుభ్రత, నాణ్యతాలోపం ఉన్న 8 హోటళ్లకు నోటీసులు జారీ



సుబ్బారావు హోటల్ వంటశాలలో పూరీలు వేస్తున్న మూకుడును తనిఖీ చేస్తున్న అధికారులు

అమలాపురం టౌన్: స్థానిక పలు హోటళ్లపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆహార నియంత్రణ అధికారులు గురువారం దాడులు చేసి ఎనిమిది హోటళ్లకు నోటీసులు జారీ చేశారు. ఒకసారి మరిగిన నూనెతోనే పదే పదే వంటకాల తయారీ, వంట గదుల్లో అపరిశుభ్రతలను అధికారులు గుర్తించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆహార నియంత్రణ అధికారి బి.శ్రీనివాస్, కోనసీమ జిల్లా ఆహార నియంత్రణ అధికారి శ్రీకాంత్ చౌదరి, తూర్పు గోదావరిజిల్లా అధికారి రుక్కయ్య, కాకినాడ జిల్లా అధికారి సుబ్బారావు బృందం ఈ తనిఖీలు చేపట్టింది. అమలాపురంలోని సుబ్బారావు హోటల్, బొండం బాబాయ్ హోటళ్లలో ఒకే నూనె చాలా సార్లు మరిగించడంపైన, గాయత్రి టిఫిన్స్‌పై రెన్యువల్ కాకపోవడంపై కేసు నమోదు చేసినట్టు ఉమ్మడి జిల్లా అధికారి శ్రీనివాస్ చెప్పారు. విష్ణుశ్రీ హోటల్, గాయత్రి టిఫిన్స్, విజయదుర్గ హోటల్, శ్రీదేవి బార్ అండ్ రెస్టారెంట్, గణపతి టిఫిన్స్, గ్రీన్ ట్రీ హోటల్‌కు పరిశుభ్రత లేకపోవడంపై నోటీసులు ఇచ్చారు. ఈ ప్రతికూల పరిస్థితులు సరిదిద్దే వరకు హోటళ్లు మూసివేయాలని మున్సిపల్ కమిషనర్ కేవీ ఆర్ఆర్ రాజుకు బృందం సూచించింది. దీంతో శుక్రవారం నుంచి ఆ హోటళ్ల మూసివేతకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలో ఎక్కడైనా ఆహార కలుషితం, కల్తీ వంటివి జరిగితే జిల్లా ఆహార నియంత్రణాధికారి శ్రీకాంత చౌదరి–89771 63695 నంబర్‌కు కాల్ చేయాలని ఉమ్మడి జిల్లా ఆహార నియంత్రణాధికారి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

నిత్యావసర ధరలు నియంత్రించాలి : జేసీ నిశాంతి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిశాంతి

అమలాపురం రూరల్: మార్కెటింగ్, పౌరసరఫరాల అధికారులు నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరల నియంత్రణలో కీలక భూమిక పోషించాలని జేసీ టి.నిశాంతి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌ని గోదావరి భవన్‌లో పౌరసరఫరాలు, మార్కెటింగ్ శాఖ, ఎస్టేట్ అధికారులతో ధరల నియంత్రణ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. రైతు బజార్ల వల్ల బహిరంగ మార్కెట్‌లో ధరలు తగ్గుముఖం పట్టాయని, వాటి నిర్వహణను మరింత మెరుగుపరచి అన్నిరకాల నిత్యావసరాలు కూరగాయలు ఒకే చోట లభించేలా, జిల్లా వ్యాప్తంగా సరసమైన ధరలు ఒకేలా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. తూనికలు కొలతల్లో వ్యత్యాసాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని ఆమె స్పష్టం చేశారు. గ్యాస్ డెలివరీ బాయ్‌లు అధిక ధర వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కె.విశాలాక్షి, డీఎస్ఓ ఎ.ఉదయ భాస్కర్, పౌరసరఫరాల సహాయ మేనేజర్ నాగేశ్వరరావు, తూనికలు కొలతలు శాఖ కంట్రోలర్ రాజేష్, ఎస్టేట్ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి క్షణం పదిలమే సుమా!

- సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం అత్యంత ముఖ్యం
- పరీక్షగా చూడొద్దు.. భవితకు తొలి మెట్టుగా చూడాలి
- పదో తరగతిలో ఉత్తమ ఫలితాలకు చక్కనైన, సులువైన చిట్కాలివిగో..



డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ

అమలాపురం టౌన్: పదో తరగతి పరీక్షల సమయంలో ప్రతి నిమిషమూ విలువైనదే. ప్రతీ విద్యార్థికీ సమయ స్పృహ ఉండాలి. పరీక్షలను ఓ భూతంలా కాకుండా భవిష్యత్ భూతద్దంలో చూసినప్పుడే ఉత్తమ ఫలితాలతో ఉత్తీర్ణులవుతారని కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు, పలు పాఠ్య పుస్తకాల రచయిత డాక్టర్ సీవీ సర్వేశ్వశర్మ సూచించారు. పదో తరగతి పరీక్షలకు సన్నద్ధవుతున్న విద్యార్థులు పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు, ఉత్తమ మార్కులు పట్టేందుకు ఆయన పలు చిట్కాలను 'సాక్షి'కి ఇలా వివరిస్తున్నారు.

- చదువుకునేందుకు ఏకాగ్రతతో కూడిన వాతావరణాన్ని ఎంచుకోవాలి. టీవీ, సెల్‌ఫోన్ చప్పుళ్లు, ఇతర రణగొణ ధ్వనులకు దూరంగా ఉండాలి.
- ఎంత ఎక్కువ సేపు చదివామన్నది ముఖ్యం కాదు. చదివింది మెదడులో ఎంత మేర నిక్షిప్తం చేశామన్నదే ముఖ్యం.
- అన్నీ వచ్చు. ప్రతీది చదివాను. పరీక్షల్లో రాయగలననే మితి మీరిన ఆత్మ విశ్వాసం పనికిరాదు. ప్రతి ప్రశ్న, జవాబును అన్వేషణ కోణంలోనే చదవాలి.
- ప్రశ్న అడిగిన తీరును బట్టి, ఆ ప్రశ్నకు ఎన్ని మార్కులో అంచనా వేసుకుని జవాబు పరిమితిని నిర్ణయించుకుని రాయాలి.
- జవాబులు చిన్న చిన్న వ్యాక్యాలతో పాయింట్స్ వారీగా రాస్తే పేపరు దిద్దే వారికి రాసే విద్యార్థిపై మంచి అభిప్రాయం కలుగుతుంది.
- దస్తూరి బాగుండే విద్యార్థుల సంగతి పక్కన పెడితే, మిగిలిన వారు కంగారు పడకుండా సాధ్యమైనంత వరకూ జవాబు పత్రాల్లో దస్తూరి గుండ్రంగా ఉండేడట్లు జాగ్రత్త పడాలి. దస్తూరీ సైతం కొన్ని మార్కులు తెచ్చిపెడుతుందనే విషయాన్ని మరచిపోకూడదు.
- పరీక్షల్లో ర్యాంక్‌లు సాధించాలంటే మేధావి కానవసరం లేదు. ప్రణాళిక బద్ధంగా, సమయ స్పృహతో చదివితే సగటు విద్యార్థికి సైతం మంచి ర్యాంకులు వస్తాయి.
- చదువుకు సంబంధించిన విషయాలను తోటి విద్యార్థులతో ఎప్పటికప్పుడు చర్చిస్తూ ఉండాలి. సందేహాలను ఉపాధ్యాయలతో చర్చించి నివృత్తి చేసుకోవాలి. ఆందోళన అనిపించినా, అందుకు కారణాలను తెలుసుకుని ప్రశాంతంగా ఉండే ప్రయత్నం చేయాలి.
- పరీక్ష రాసేడప్పుడు సమయం దగ్గర పడుతున్న క్రమంలో జవాబులు రాసేందుకు వేగం పెంచాలే తప్ప ఏకాగ్రత, సమర్థత తప్పకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ఉండాలి.
- ప్రశ్నకు జవాబుగా మీ తెలిసిన సమాచారం అంతా రాస్తే ఎక్కువ మార్కులు పడకపోగా సమయం కూడా వృధా అవుతుంది. ఎంత అవసరమో అంతే జవాబు రాయాలి.
- రాసే జవాబులో కొట్టివేతలు లేకుండా ముఖ్యమైన అంశాలను హైలెట్ చేస్తే ఎక్కువ మార్కుల సాధనకు అవకాశం ఉంటుంది.
- ప్రశ్నా పత్రం ఇవ్వగానే ఓ సారి ఆద్యంతం చదవాలి. ముందు మనకు సునాయసంగా అనిపించిన, తెలిసిన ప్రశ్నలకు జవాబులు రాయాలి. పరీక్ష రాయడం మొదలు పెట్టకుండానే సంక్లిష్టంగా ఉన్న ప్రశ్నల గురించి ఆలోచించి సమయం వృథా చేయకూడదు.
- ప్రతి పరీక్షను ఓ సవాలుగా తీసుకోవాలి. అదో సమస్యగా ఎంచుకుని మథన పడకూడదు. చదువును ఓ తపస్సులా భావించాలి, పరీక్షలను ఉషస్సుల్లా మలుచుకోవాలి.
- ప్రశ్నా పత్రంలో ఏ ఒక్క ప్రశ్నను తెలీదు అని వదిలేయకూడదు. ఆ ప్రశ్నకు రిలేటెట్‌గా ఉన్న సమాచారాన్ని ఇచ్చే ప్రయత్నం చేయడం వల్ల కొన్ని మార్కులైనా సాధించే వీలుంటుంది.

ఎకో సెన్సిటివ్ ప్రణాళిక సిద్ధం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: కోరంగి వైల్డ్ లైఫ్ అభయారణ్యం పరిధిలో వివిధ శాఖల ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఎకో–సెన్సిటివ్ జోనల్ మాస్టర్ ప్లాన్ తయారీకి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా అటవీ శాఖ అధికారి ఎంవీ ప్రసాద రావు, కాకినాడ జిల్లా అటవీ శాఖ అధికారి డి.రవీంద్రనాథ్ రెడ్డితో కలిసి కోరంగి వైల్డ్ లైఫ్ అభయారణ్యం జోనల్ మాస్టర్ ప్లాన్ తయారీపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. కోనసీమ జిల్లా పరిధిలో ఎకో సెన్సిటివ్ జోన్ సరిహద్దు 50 మీటర్ల నుంచి సముద్రం లోపల ఐదు కిలోమీటర్ల పరిధి 12 కిలో మీటర్ల పొడవునా ఉందని తెలిపారు. అక్కడి సామాజిక ఆర్థిక పరిస్థితులు, జీవన శైలి, కార్యకలాపాలపై సైంటిఫిక్ మ్యాపులను రూపొందించి మార్చి 15 నాటికి డ్రాఫ్ జోనల్ మాస్టర్ ప్లాన్ సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ రవీంద్రనాథ్ రెడ్డి కోరంగి వైల్డ్ లైఫ్ అభయారణ్యం జోనల్ మాస్టర్ ప్లాన్ తయారీని సభ్యులకు వివరించారు. సమావేశంలో హైదరాబాద్ పర్యావరణ అభివృద్ధి కేంద్రం ఆర్‌డీ డాక్టర్ కె.జయచంద్రజీ, పశు సంవర్ధక శాఖ జేడీ ఎస్.వెంకట్రావు డీఆర్‌పీ పీడీ శివ శంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	18,500
గటగట (వెయ్యి)	16,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	15,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

ఉత్సాహంగా హాకీ పోటీలు



హాకీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో సివిల్ సర్వీసెస్ ఆలిండియా హాకీ పోటీలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. పురుషుల విభాగంలో ఆర్‌ఎస్బీ భువనేశ్వర్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్‌ఎస్బీ కొచ్చి జట్టు 5–0 స్కోర్‌తో, గోవా సెక్టార్‌తో జరిగిన మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ 4–0 స్కోర్‌తో, ఆర్‌ఎస్బీ రాయ్‌పూర్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్‌ఎస్బీ కాన్పూర్ 4–0 స్కోర్‌తో గెలుపొందాయి. ఢిల్లీ సెక్టార్‌తో జరిగిన మ్యాచ్‌లో హర్యానా 0–1 స్కోర్‌తో విజయం సాధించింది. మహిళల విభాగంలో ఉత్తరాఖండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఒడిశా 5–0 స్కోర్‌తో, బీహార్ సెక్టార్‌తో జరిగిన మ్యాచ్‌లో 3–2 స్కోర్‌తో హర్యానా సెక్టార్, తెలంగాణ సెక్టార్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ సెక్టార్ 6–0 స్కోర్‌తో విజయం సాధించాయి.

దాతల ఆశయాలకు తూట్లు

- రూ.30 లక్షలతో నిర్మించిన నివేదనశాల నిరుపయోగం
- కేవలం మూడు నెలల పాటే వినియోగం
- లక్ష్యం నెరవేరడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న దాత తాతబాబు



రిసెప్షన్ కౌంటర్‌పై నిరుపయోగంగా ఉన్న దాత నిర్మించిన నివేదన శాల

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం వీర వేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో దాతల ఆశయాలు నెరవేరడం లేదు. విరాళాల కోసం, భవనాల నిర్మాణం కోసం దాతల చుట్టూ తిరిగి అవసరం తీరాక వారు నిర్మించిన భవనాలను నిరుపయోగంగా వదిలేస్తుండడం వారి తీవ్ర మనస్తాపానికి తావిస్తోంది . తుని పట్టణానికి చెందిన దాత చెక్కా సూర్యనారాయణ (తాతబాబు) సమర్పించిన రూ.30 లక్షలతో నిర్మించిన నివేదన షెడ్డు నిరుపయోగంగా వదిలేసారు. దీంతో తాతబాబు అక్కడి అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వివరాల్లోకి వెళితే సత్యదేవునికి నిత్యం ఏదో ఒక రూపంలో ఏదో ఒక లక్ష్యంతో దాతలు తోచినంత విరాళం సమర్పిస్తారు. కొన్ని సందర్భాలలో భారీ నిర్మాణాల కోసం అధికారులే దాతల వద్దకు వెళ్లి అభ్యర్థిస్తుంటారు. ఈ నేపథ్యంలో స్వామివారి నివేదనశాల నిర్మాణానికి షెడ్డు నిర్మాణానికి తుని పట్టణానికి చెందిన చక్కా తాతబాబు నుంచి 2023 జూన్ నెలలో అప్పటి ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ రూ.30 లక్షల విరాళాలాన్ని తీసుకువచ్చారు. ఈ మొత్తంతో దేవస్థానం పండితుల అనుమతితో నివేదన శాల నిర్మించి ఆగస్టు నెలలో దాతచే దీనిని ప్రారంభించారు. కొంత కాలం దీనిలోనే నివేదనలు సాగాయి.

కాగా 2023 నవంబర్‌లో ఈఓ చంద్రశేఖర్ అజాద్ బదిలీ కాగా ఆయన స్థానంలో ఇన్‌చార్జి కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో నివేదన శాల భూస్పర్శతో భూమి మీదనే ఉండాలని కొందరు పండితులు సూచించడంతో పాత నివేదనశాల లోనే నివేదనలు తయారు చేయాలని ఆదేశించారు. దీంతో 2023 నవంబర్ నుంచి పాత నివేదనశాల లోనే నివేదనలు తయారు చేయించి స్వామివారికి నివేదిస్తున్నారు. ఈ పరిణామాలపై దాత తాతబాబు అధికారులు కోరితేనే నివేదన భవనానికి విరాళం సమర్పించానని పేర్కొన్నారు. దేవస్థానంలో నివేదనలతో బాటు భక్తులకు పంపిణీ చేసేందుకు పులిహోర, దద్దోజనం, బాలభోగం, చక్రపొంగలి, కట్టు పొంగలిని నివేదనశాల లో తయారు చేస్తున్నారు. అలాగే దేవాలయంలో పనిచేసే అర్చకులు, వ్రత పురోహితులకు మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. ఈ పదార్థాలను కూడా ఇక్కడే తయారు చేస్తున్నారు. అయితే దేవునికి పెట్టే నివేదనలు పాత నివేదన శాలలో తయారు చేసి భక్తులకు పంపిణీ చేసే వాటిని దాత నిర్మించిన షెడ్డులో తయారు చేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కొత్త షెడ్డును వినియోగంలోనికి తెస్తాం



దాత తాతబాబు నిర్మించిన నివేదన షెడ్డును కూడా వినియోగంలోకి తేవాలని నిర్ణయించాం. ఇక్కడ భక్తులకు పంపిణీ చేసే పులిహోర, ఇతర ప్రసాదాలు తయారు చేయిస్తాం. ఇవి తయారు చేయడానికి ఒక కుక్, మరో సహాయకుడు అవసరం. వారిని నియమించడానికి ఎంఎల్‌సీ ఎన్నికల కోడ్ అడ్డుగా ఉంది. ఆ కోడ్ ముగిసాక వారిని నియమించి తదుపరి చర్యలు తీసుకుంటాం.

– వీర్ల సుబ్బారావు, ఈఓ, అన్నవరం దేవస్థానం

ప్రేమ పేరుతో వేధిస్తున్న యువకుడి అరెస్టు

తాళ్లపూడి: తనను ప్రేమించడం లేదన్న కోపంతో ఓ యువతి చదువుతున్న కళాశాలకు వెళ్లి ఆమెపై దాడికి పాల్పడిన ఘటన వేగేశ్వరపురంలో చోటు చేసుకుంది. ఈ ఘటనలో గజ్జరం గ్రామానికి చెందిన యువకుడిని అరెస్టు చేశారు. తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న సమయంలో తనతో చనువుగా ఉన్న విద్యార్థినిని అదే కళాశాలలో చదివి మానేసిన గొల్ల దిలీప్‌కుమార్ ప్రేమిస్తున్నానంటూ వేధిస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల ఒక రోజు కళాశాలకు వెళ్లి ఆమెపై చేయిచేసుకున్నాడు. అయినా ఆమె స్పందించడం లేదని బుధవారం మరోసారి కళాశాలకు వెళ్లి తనను ప్రేమించకుంటే వదిలేది లేదని, జీవితాన్ని పాడుచేస్తానని బెదిరించి మరో సారి చేయిచేసుకున్నాడు. దీంతో ఆ విషయాన్ని ఆమె తన తల్లిదండ్రులకు చెప్పగా వారు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడు దిలీప్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి కోర్టుకు పంపినట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు. గతంలో పలు మార్లు కళాశాలలోను, పాఠశాలల్లోనూ ఈవ్ టీజింగ్, ర్యాగింగ్‌పై అవగాహన కల్పించామని, అయినా అక్కడక్కడ ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని, ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే తీవ్ర చర్యలు వుంటాయని ఎస్సై హెచ్చరించారు.

వీక్షణతో విషయాసక్తి వృద్ధి

- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విజ్ఞాన యాత్రలు
- నిధులు కేటాయించిన సమగ్ర శిక్ష విభాగం



రాయవరం: తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను ప్రత్యక్షంగా చూడడం ద్వారా విద్యార్థులలో సంబంధిత అంశాలపై ఆసక్తి పెరుగుతుంది. శాస్త్రీయ పరిశోధన, ప్రయోగశాల, క్షేత్ర స్థాయి పర్యటనల ద్వారా ఆ అనుభవాన్ని పొందేందుకు ఉద్దేశించినదే 'సైన్స్ ఎక్స్‌పోజర్ విజిట్'. వీటినే స్టడీ టూర్స్‌గా పిలుస్తుంటారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విజ్ఞానంతో కూడిన విహార యాత్రలకు సమగ్ర శిక్ష చర్యలు చేపట్టింది. ఈ మేరకు విద్యార్థులకు క్షేత్ర స్థాయి పర్యటనలకు అవకాశం కల్పిస్తూ సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేసి ఆ మేరకు నిధులు కేటాయించారు.

ప్రాథమిక, సెకండరీ పాఠశాలలకు

జిల్లాల వారీగా ప్రాథమిక పాఠశాలలు, సెకండరీ పాఠశాలల విద్యార్థులు విజ్ఞాన యాత్రలకు వెళ్లనున్నారు. 60కు పైగా విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలల నుంచి ఒక్కో విద్యార్థిని ఎంపిక చేస్తారు. అలా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి 46, తూర్పుగోదావరి జిల్లా 113, కాకినాడ జిల్లా 168 ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేశారు. సెకండరీ పాఠశాలల స్థాయిలో బాలురు, బాలికలు, పాఠశాల ఉపాధ్యాయులు, గైడ్ టీచర్లు, ఏఎంవోలు, డీఎస్‌వోలు ఈ విజ్ఞాన విహార యాత్రలకు వెళ్లనున్నారు. కాకినాడ జిల్లా నుంచి బాలురు 21, బాలికలు 42, ఉపాధ్యాయులు 21, గైడ్ టీచర్లు 20, తూర్పుగోదావరి నుంచి బాలురు 19, బాలికలు 38, టీచర్లు 19, గైడ్ టీచర్లు 18, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి బాలురు 44, బాలికలు 88, టీచర్లు 38, గైడ్ టీచర్లు 25 మందిని ఎంపిక చేశారు. అలాగే ఆయా జిల్లాల నుంచి సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారులు, జిల్లా సైన్స్ అధికారులు వీరితో యాత్రలకు వెళ్లనున్నారు.

కేటాయింపులు ఇలా

విజ్ఞాన యాత్రలకు వెళ్లే విద్యార్థులకు సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు ఆయా జిల్లాలకు నిధులను కేటాయించారు. ప్రాథమిక స్థాయిలో జిల్లా స్థాయి పర్యటనకు ఒక్కో విద్యార్థికి రూ.200, రాష్ట్రేతర పర్యటనకు ఒక్కో విద్యార్థికి రూ.2వేలు కేటాయించారు. అలాగే సెకండరీ స్థాయి విద్యార్థులకు రాష్ట్రంలో, ఇతర రాష్ట్రాలకు పర్యటనకు వెళ్లే ఒక్కో విద్యార్థికి రూ.2 వేలు కేటాయించారు.

ఎంపిక చేసిన ప్రాంతాలు

రాష్ట్రం లోపల..

- శ్రీహరికోట (షార్), తిరుపతి (సైన్స్ సెంటర్), చిత్తూరు(అగస్త్య), విశాఖపట్నం (నేవల్ డాక్‌యార్డ్, స్టీల్ ప్లాంట్, హెచ్‌పీసీఎల్).

ఇతర రాష్ట్రాలలో..

- వైటమ్, నెహ్రూ ప్లానిటోరియం (బెంగుళూరు), బిర్లా ప్లానిటోరియం (హైదరాబాదు), ఐఐఎస్ఈఆర్(పూనే), గిండీ నేషనల్ పార్క్ మరియు పెరియార్ సైన్స్ సెంటర్ (చెన్నై).

స్టడీ ట్రిప్ లక్ష్యాలివీ..

- సైన్స్, గణిత ప్రయోగాలు, ప్రదర్శనలను విద్యార్థులకు ప్రయోగాత్మకంగా చూపించడం.
- సైన్స్ అండ్ టెక్నాలజీపై విద్యార్థుల్లో ఉత్సుకత, ఆసక్తిని పెంచడం.
- విద్యార్థులు చూసి నేర్చుకోవడానికి అనువుగా ప్రదర్శనలు ఏర్పాటు చేయడం.
- సమస్యలను ఎదుర్కోవడం, సమస్యలకు పరిష్కారాన్ని కనుగొనే నైపుణ్యాలను విద్యార్థుల్లో అభివృద్ధి చేయడం.

విధి విధానాలు ఇలా..

- విజ్ఞాన యాత్రలకు లక్ష్యానికి అనుగుణంగా సందర్శించే ప్రాంతాన్ని ఎంపిక చేసుకోవాలి.
- సదరన్, జిల్లా సైన్స్ ఫేర్‌లో విజేతలైన విద్యార్థులను పర్యటనలకు ఎంపిక చేసుకోవాలి.
- ప్రతి 10 మంది బాలికలకు ఒక మహిళా టీచర్‌ను ఎస్కార్ట్‌గా ఎంపిక చేయాలి.
- 40–50 మంది విద్యార్థులకు ఒక బస్సును ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.
- సురక్షిత, భద్రతకు ఆర్టీసీ బస్సులను ఎంపిక చేసుకుంటే మేలు.
- ప్రయాణంలో అవసరమైన ఏర్పాట్లు ముందుగా చేసుకోవాల్సి ఉంటుంది. అవసరమైన మందులు, ఫస్ట్ ఎయిడ్ కిట్‌ను అందుబాటులో ఉంచుకోవాలి.
- ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల నుంచి ముందస్తు అనుమతి తీసుకుని వెళ్లాలి.
- ప్రతి పది మంది విద్యార్థులను ఒక బృందంగా ఏర్పాటు చేసి, ప్రతి బృందానికి ఒక ఎస్కార్ట్ టీచర్‌ను ఇవ్వాల్సి ఉంటుంది.

ఏర్పాట్లు చేస్తున్నాం



విద్యార్థులు తరగతి గదిలో చదివిన విషయాన్ని ప్రత్యక్షంగా చూడడం ద్వారా లోతైన అధ్యయనం జరుగుతుంది. సమగ్ర శిక్ష ద్వారా ప్రాథమిక, సెకండరీ పాఠశాలల విద్యార్థులకు ఈ మేరకు నిధులు కేటాయించారు. విద్యార్థులు స్టడీ టూర్ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

అతి వేగానికి యువకుడి బలి

- విజయవాడ నుంచి విశాఖ వెళ్తుండగా ఘటన
- ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి
- మరో వ్యక్తికి స్వల్ప గాయాలు



వ్యాన్‌ను ఢీకొని మృతి చెందిన విజయ్‌కుమార్

దేవరపల్లి: అతివేగం ఒక యువకుడి ప్రాణం తీసింది. పోలీసుల కథనం ప్రకారం విజయవాడకు చెందిన కల్లూరి విజయ్‌కుమార్ (30), ఏలూరులోని వినాయకనగర్‌కు చెందిన ఏలేటి గోవింద్ వరుసకు బావ, బావమరుదులు. ఇద్దరూ కలసి గురువారం ఉదయం విశాఖపట్నంలో బంధువుల ఇంట జరుగుతున్న వివాహానికి బయలుదేరారు. విజయ్‌కుమార్ ద్విచక్ర వాహనం నడుపుతుండగా, గోవింద్ వెనుక కూర్చున్నాడు. దేవరపల్లి మండలం గౌరీపట్నం వద్దకు వచ్చే సరికి హైవేపై ఆగి ఉన్న ఐషర్ వ్యాన్‌ను వెనుక నుంచి బలంగా ఢీ కొన్నారు. ఈ ఘటనలో విజయ్‌కుమార్ తలకు బలమైన గాయం కాగా చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. గోవింద్‌కు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స అందిస్తున్నట్టు ఏఎస్ఐ నాగభూషణం తెలిపారు. విజయ్‌కుమార్ తల్లిదండ్రులు ఉదయం విశాఖపట్నం వెళ్లగా వెనుక ద్విచక్ర వాహనంపై వీరిద్దరు బయలుదేరారు. విజయ్‌కుమార్‌కు హెల్మెట్ ఉన్నప్పటికీ ధరించకపోవడం వల్ల మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

- 32 మందిపై కేసు నమోదు
- 7 కార్లు, 30 సెల్‌ఫోన్లు, రూ.6.02 లక్షల నగదు స్వాధీనం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ విజయశంకరం

నల్లజర్ల: మండలంలోని రిజర్వు ఫారెస్ట్ సమీపంలో ముసుళ్లగుంట వద్ద రాత్రి వేళ ఫ్లడ్‌లైట్లతో నిర్వహిస్తున్న కోడిపందేలపై గురువారం తెల్లవారు జామున 4 గంటలకు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 32 మందిపై కేసు నమోదు చేసి వారి నుంచి 30 సెల్‌ఫోన్లు, 7 కార్లు, రూ.6 లక్షల 2 వేల 110 స్వాధీనం చేసుకున్నట్టు సీఐ విజయశంకరం తెలిపారు. స్థానిక సిబ్బందితో పాటు కొవ్వూరు ఎస్ఐ జగన్, ప్రత్యేక పోలీస్ దళం పాల్గొంది. ఎస్ఐ సోమరాజు కేసు నమోదు చేశారు. రాష్ట్రంలోని కాకినాడ, కడప, గోపాలపురం, ఉంగుటూరు ప్రాంతాల నుంచి జూదగాళ్లు ఈ పందెలలో పాల్గొన్నారు. నిర్వాహకులైన ముగ్గురిని గుర్తించి ఒకరిని అదుపులోకి తీసుకున్నారు.

జూదాలకు అడ్డాగా రిజర్వు ఫారెస్ట్

మండలంలోని రిజర్వు ఫారెస్ట్ జూదాలకు అడ్డాగా మారింది. ముసుళ్లగుంట, పుల్లలపాడు గ్రామాలకు ఆనుకొని దూరం ఉన్న రిజర్వు ఫారెస్ట్ అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. పగలంతా నాలుగైదు చోట్ల పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నట్టు సమాచారం. వారాంతరంలో డిస్కో డ్యాన్సులు, ఖవాలీలు, రేవ్ పార్టీలు జరుగుతున్నట్టు చెబుతున్నారు. నిర్వాకులు వివిధ హోదాలలో ఉండడంతో అందరికీ తెలిసినా తమకేమి పట్టనట్టుగా ఉంటున్నారు. పోలీసులకు మామూళ్లు అందడం వల్లే వారు ఇలా బరితెగిస్తున్నారని స్థానికులు అంటున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, నగదు, కార్ల తాళాలు

సస్య రక్షణతో మరింత మధురం

- పెట్టుబడి వ్యయం తగ్గుదల
- అధిక, నాణ్యమైన దిగుబడి
- చెరకులో యాజమాన్య పద్ధతులు సూచిస్తున్న వ్యవసాయ అధికారులు

పాడి - పంట



పి.చంద్రశేఖర్, ఏడీఏ, కొవ్వూరు

పెరవలి: చెరకు సాగు చేయడానికి ఇదే అనువైన కాలం. ఈ సాగు చేసే రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని కొవ్వూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు (ఏడీఏ) పి.చంద్రశేఖర్ వివరించారు. జిల్లాలో పెరవలి, నిడదవోలు, ఉండ్రాజవరం, కొవ్వూరు, చాగల్లు, నల్లజర్ల, దేవరపల్లి, ద్వారకాతిరుమల, రాజమహేంద్రవరం రూరల్, కడియం మండలాల్లో 850 హెక్టార్లలో చెరకు సాగవుతోంది. ఈ సాగుకు తీసుకోవలసిన జాగ్రత్తలను పరిశీలిస్తే..

నేలల స్వభావం

ఈ పంటకు నీటి సదుపాయం ఉన్న మెరక భూములు అనువైనవి. భూములను 25 నుంచి 30 సెంటీ మీటర్ల లోతు వరకు మెత్తటి దుక్కు చేయాలి. ఎకరానికి 10 టన్నుల పశువుల ఎరువును వేసి ఆఖరి దుక్కులో కలియదున్నాలి. చేనును సమాంతరంగా చేయాలి.

నాట్లు వేసే సమయం

ఉభయ గోదావరి జిల్లాల్లో చెరకు పంటను జూన్ నుంచి జూలై వరకు, డిసెంబర్ నుంచి మార్చి నెలాఖరు వరకు నాటుకోవచ్చు.

నాటే విధానం

మొదటిసారి వేసే రైతులు చేలో పూర్తిగా నీరు పెట్టి నీరు ఇంకిన 3 రోజుల తరువాత విత్తనం చెరకు గడలను ముక్కలుగా చేసి 2.5 సెంటీమీటర్ల లోతులో నాటుకోవాలి. కార్సీ తోటల రైతులు చేలో ఉన్న చెత్తకు నిప్పుపెట్టి అంటించిన తరువాత నీరు పెట్టాలి.

నీటి యాజమాన్యం

పంట వేసిన తరువాత 6 రోజులకు ఒకసారి 4 నెలల పాటు సాగు నీటిని అందించాలి. పక్వ దశలో 3 వారాలకు ఒకసారి నీరు అందించవచ్చు.

ఎరువుల యాజమాన్యం

చెరకు తోట వేసిన 45 రోజులు, 90 రోజులు, 120 రోజులకు ఎరువులను వేయాలి. నత్రజని 67 కిలోలు, భాస్వరం 40 కిలోలు, పొటాష్ 48 కిలోలు 3 సమభాగాలుగా చేసి వీటిని అందించాలి. వీటితో పాటు నత్రజనిని అందించే జీవన ఎరువులైన అజటోబాక్టర్ ఎకరానికి 2 కిలోల చొప్పున పశువుల ఎరువుతో కలిపి రెండు దఫాలుగా వేయాలి. నాటిన 3వ రోజున ఒకసారి,



45 రోజులకు మరోసారి వేసుకుంటే నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవచ్చు. అలాగే ఎకరానికి 4 కిలోలు పాస్ఫో బాక్టీరియాను నాటిన 6వ రోజున వేసుకుంటే భాస్వరం ఎరువును కూడా తగ్గించుకోవచ్చు.

కార్సి తోటల సాగు

మొక్క తోటల కన్నా కార్సి తోటలు త్వరగా పక్వానికి వస్తాయి. సాగులో ఖర్చు కూడా తగ్గుతుంది. నీటిని తట్టుకునే గుణం ఈ తోటలకు ఉంటుంది. కార్సి తోటల్లో దుబ్బుల నుండి మొలకెత్తేటప్పుడు కలుపు నివారణకు మందులు వాడకూడదు. కార్సీ తోటలు ఉన్న రైతులు చేలో ఉన్న చెత్తను కాల్చడం కానీ, ఆ చెత్తను కుళ్లబెట్టడానిక ట్రికోడెర్మా విరిడి మందును పేడనీళ్లతో కలిపి చెత్తపై చల్లాలి. దీనితో పాటు పది కిలోల సూపర్‌ఫాస్పేట్, 8 కిలోల యూరియా రెండూ కలిపి చెత్తపై చల్లాలి. దీనివలన భూమిలో తేమశాతం నిలబడటమే కాకుండా చెత్త బాగా చివికి ఎరువుగా ఉపయోగపడుతుంది. ఈ పంటలపై ఎక్కువగా పీక పురుగు, కాండం తొలిచే పురుగు, పొలుసుపురుగు, తెల్ల నల్లి, లద్దె పురుగులు ఆశిస్తాయి. ఈ పురుగులు పంటను ఆశించకుండా చేలలో కలుపు లేకుండా శుభ్రంగా ఉంచుకుంటే కొంతవరకు వాటిని అరికట్టవచ్చు. పంటపై కాటుక తెగులు, ఎర్ర కుళ్ల తెగులు, మొవ్వ కుళ్ల తెగులు ప్రభావం అధికంగా ఉంటుంది. ఇవి ఆశించినప్పుడు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.



తీపర్రులో చెరకు పంటను వేస్తున్న రైతులు

అనుమానాస్పద స్థితిలో వైద్యుని మృతి

- ప్రేమ విఫలమై మద్యానికి బానిసైన వైనం
- లాడ్జి గదిలో భారీగా మద్యం సీసాలు లభ్యం

అమలాపురం రూరల్: ప్రేమ విఫలమైందన్న మనస్తాపంతో ఓ వైద్యుడు పట్టణంలోని గణపతి లాడ్జిలో అనుమాన స్థితిలో మృతి చెందాడు. టౌన్ సీఐ వీరబాబు తెలిపిన వివరాల మేరకు విజయవాడ పోరంకికి చెందిన వైద్యుడు యలమంచిలి వెంకట్ జైనేంద్రి (28) మృతి చెందారు. జైనేంద్రి స్థానిక కిమ్స్ ఆస్పత్రిలో 20 రోజుల క్రితం వరకు వైద్యునిగా పనిచేశారు. వారం రోజులుగా గణపతి లాడ్జిలో ఉంటూ మితి మీరి మద్యం తాగి ప్రాణాలు కోల్పోయారు. లాడ్జి సిబ్బంది సమాచారంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గదిని పరిశీలించి భారీగా మద్యం సీసాలను గుర్తించారు. అనంతరం వారు అతని తండ్రికి విషయాన్ని చెప్పగా, ప్రేమించిన అమ్మాయికి పెళ్లి కుదరడం, ప్రేమ విఫలమవడంతో మద్యానికి బానిసయ్యాడని వివరించారు. ఈ మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు



నిందితులను చూపుతున్న పోలీసులు

కాకినాడ రూరల్: మోటారు సైకిలిస్టును అడ్డగించి నిర్జన ప్రదేశానికి తీసుకువెళ్లి కత్తితో బెదిరించి బైక్, సెల్‌ఫోన్లు, ఇయర్ బడ్స్ అపహరించుకుపోయిన నలుగురు నిందితులను సర్పవరం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సీఐ పెద్దిరాజు తెలిపిన వివరాల మేరకు కాకినాడ శ్రీనగర్‌లోని ఒక ప్రైవేట్ కళాశాలకు చెందిన హాస్టల్‌లో ఆఫీస్ అసిస్టెంట్‌గా పనిచేసే సత్తి వివేకానంద రెడ్డి ఈనెల 17న అర్ధ రాత్రి టీ తాగేందుకు డీ మార్ట్ ప్రాంతానికి తన మోటారు సైకిల్‌పై వెళ్లాడు. టీ దుకాణము మూసి ఉండడంతో డైరీ ఫారం సెంటర్ వైపు దుమ్ములపేట సూర్య బార్ అండ్ రెస్టారెంట్ ప్రాంతానికి చేరుకున్నాడు. అక్కడ డైరీ ఫారం సెంటరుకు చెందిన యెలెపె మేఘశ్యామ్, రామకృష్ణారావుపేటకు చెందిన డెక్కాతి ఎల్లయ్య రెడ్డి, సంజయ్‌నగర్ పర్లోపేటకు చెందిన కొత్తుర్తి వీరబాబు, రామకృష్ణారావు పేటకు చెందిన షేక్ ఇబ్రహీం అతడిని అడ్డగించి బైక్ కీ లాక్కుని అతడిని తమ మోటారు సైకిల్‌పై అక్షర స్కూల్ ప్రాంతానికి తీసుకువెళ్లారు. అక్కడ అతని మెడపై కత్తి ఉంచి చంపుతామని బెదిరించి దాడి చేసి మూడు ఫోన్లు, ఇయర్ బడ్స్, గ్లామర్ బైక్ తీసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఈనెల 18న పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ బిందు మాధవ్, ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనిష్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు 24 గంటల వ్యవధిలోనే దుమ్ములపేట కూరగాయల మార్కెట్ వద్ద నిందితులను అరెస్టు చేసి 24 గంటలలోనే కేసు ఛేదించినట్టు సీఐ పెద్దిరాజు తెలిపారు. చోరీ చొత్తుతో పాటు నిందితులు వినియోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు.